పిల్లలూ – పెద్దవాళ్ళు

అవధానుల విజయలక్ష్మి

బాబాయి పెళ్ళనగానే నాకెంత సరదా వేసిందో !

డాబామీదికి పరిగెత్తి సాయంత్రం దాకా స్కిప్పింగ్ చేసుకొంటూ ఉండిపోవాలని పించింది ... వీధి చివర మైదాన ముందే అక్కడికెళ్లి ఆకుపచ్చటి గడ్డిలో ఈ చివర్నించి ఆ చివరిదాక పరుగులు పెట్టాలనిపించింది...పార్కు మధ్యలో జారుడుబండ ఉందే దానిమీది కెక్కి జాంయిమని జారిపోవాలని పించింది.

బోల్డంత హుషారొచ్చేసిందిగా ... మరేం చెయ్యడం ? అందుకే డాబామీది కెక్కి హాయిగా స్కిప్పింగ్ చేస్తూ కూర్చొన్నాను. కింటినించి అమ్మ కేకేసింది.

"ఒసే చిట్టీ తొందరగా రావేతల్లీ...ఇవాళ బండిలో బాబాయి పెళ్లిచూపుల కెళ్లాలిగా."

నేను గబగబా కిందికి పరిగెత్తాను. అసలు మొన్ననే చెప్పింది అమ్మ "మనం ఎల్లుండి బాబాయి పెళ్లిచూపుల కెళ్తాం తెలుసా !" అని.

నాకెంత సరదా వేసిందో ! పెళ్లంటే ఎంత బాగుంటుందో ! చక్కా బోల్డు మంది పిల్లలొస్తారు. హాయిగా అన్ని ఆటలూ ఆడుకోవచ్చు... మరేమో ఎంచక్కా బాజాలు వాయించుతారు. వింటుంటే ఎంత బాగుంటుందో !

"బాబాయికి పెళ్లా ? అమ్మా ... భలే భలే" అంటూ గెంతాను.

"పెళ్లికాదే పిల్లా ! పెళ్లిచూపులు ! ... అంటే తెలుసా ? మరి బాబాయి పెళ్లి చేసుకోవాలంటే ఓ అమ్మాయి ఉండొద్దూ ? మరి ఆ అమ్మాయి ఎలా ఉందో మనం చూడొద్దూ ? అందుకే ఎల్లుండి పొద్దున్నే ఆ ఆంటీ వాళ్ళారికి వెళ్తాం" అమ్మ అలా చెప్పగానే బోల్డంత సంతోషం వేసేసింది. 'బండిలో వెళ్తాంట' ఎంత బాగుంటుందో ! ఎంచక్కా

కిటికీ పక్కనే కూర్చొంటే మరీ బోల్డు బాగుంటుంది !

అందుకే మొన్నటినించీ నా సామాన్లన్నీ నా చిన్న అల్యూమినియం పెట్టెలో సర్దేసు కొంటున్నాను. నా బొమ్మలూ, కామిక్‌లూ... అన్నీనూ.

అయినా ఈ పెద్దవాళ్ళేంటో ఒక్కోసారి ఉత్త పిచ్చివాళ్ళలా ఉంటారు.

"పెళ్ళికెళ్తూ పిల్లని చంకనబెట్టుకొని వెళ్ళాడట... నిలాటివాడే ఎవడో... అక్కడికి ఈ బొమ్మలూ, పుస్తకాలు ఎందుకే తల్లీ" అంటూ నేను కష్టపడి సర్దుకొన్నవన్నీ తీసేసింది.

నాకెంత కోపమొచ్చిందో ! చాలాసేపు డాబా మీది కెళ్ళిపోయి ఎవ్వరితోనూ మాట్లాడకుండా కూర్చొండిపోయాను... ఆఖరికి కడుపులో బోల్డు ఆకలేసేసి దిగిపోయాను.

"పదవే చిట్టితల్లీ... స్నానం చేయించు తాను. ఇవాళ గబగబా తెమలాలి తెలుసా !" అంది అమ్మ నా గౌను విప్పి గబగబా నన్ను బాత్రూంవైపు తీసికెళుతూ.

రోజూ అయితే అలా స్నానానికని అమ్మ ఈడ్చుకెళ్ళిపోతుంటే చాలా చికాగ్గా ఉంటుంది. మరివాళ చాలా హుషారుగా ఉన్నాను కదా అందుకే అమ్మ వెనకే గబగబా నడిచాను.

స్నానం చేయించుతూ అమ్మంది.

"అక్కడికెళ్ళాక వాళ్ళింట్లో అల్లరి చెయ్యకుండా బుద్ధిగా ఉండాలి తెలుసా !"

ఏంటో ఈ పెద్దవాళ్ళు ! ! ఈ మాట రెండు రోజుల్నుంచి చెపుతోంది కదా ! నాకు మాత్రం బోరుకొట్టదూ ?

"పోనీ అమ్మా ... రైల్లో అల్లరి చేసుకోవచ్చా ?" అడిగేశాను.

"అవునుమరి ... రైల్లోనూ అల్లరి చెయ్యకుండా... అక్కడి కెళ్ళాకా కూడా చెయ్యకుండా... రోజల్లా బుద్ధిగా ఉండడమంటే కష్టం కాదూ !" అమ్మ నవ్వింది.

"భడవకానా...పోన్లే ట్రెయిన్లో బోల్డు నీ క్కావలసినంత అల్లరి చేసుకో... అక్కడి కెళ్ళాక మాత్రం బుద్ధిగా ఉండాలి."

"ఓ అలాగే బోల్డు బుద్ధిగా ఉంటాను."

"అక్కడ వాళ్ళు తినడానికి ప్లేట్లో మిక్చరూ, జిలేబీలూ అలాంటివి ఇచ్చారనుకో పూర్తిగా తినేయకూడదు. కొంచెం ఒదిలెయ్యాలి. లేకపోతే కక్కుర్తి పిల్లవనుకొంటారు."

"మరి ఇంట్లోనేమో ఒదిలేస్తే దెబ్బలాడతావు. అక్కడేమో 'తినకుండా ఒదిలేయాలని చెప్తావు" అన్నాను.

అవును మరి. ఈ పెద్దవాళ్ళు ఒక్కోసారి వాళ్ళేం చెప్తారో వాళ్ళే మర్చిపోతుంటారుకదా !

అమ్మ నావైపు కోపంగా చూసింది. అయ్య బాబోయ్. ఊరికి తీసికెళ్ళడం మానేస్తుందేమో !

"సరేలే... పూర్తిగా తినకుండానే ఒదిలేస్తాన్లే. మరి బోల్డు బాగున్నా ఒదిలేయాలా ?"

"ఊ"

"మరి జిలేబీ కాకుండా లడ్డూ ఇచ్చినా ఒదిలేయాలా ?"

"చంపుతున్నావుకదే నీ ప్రశ్నలతో... మరి నువ్విలా అల్లరి పెడుతూ కూర్చున్నావంటే ట్రెయిను వెళ్ళిపోతుంది. మనం ఊరికివెళ్ళలేం" అంది అమ్మ తువాల్తో గబగబా నా ఒళ్ళు తుడుస్తూ.

"సరేన్లే... ఏదిచ్చినా ఒదిలేస్తాన్లే. మరి చిన్న ముక్క ఒదిలేయాలా ? పెద్ద ముక్కా?" అడిగాను. అడక్కపోతే నాకు మాత్రం ఎలా తెలుస్తుంది ? మళ్ళా ఎక్కువ ఒదిలేస్తే ఇంట్లో దెబ్బలాడినట్లే దెబ్బలాడదూ ?

అమ్మేం జవాబు చెప్పలేదు. నన్ను గబగబా బాత్రూంలోంచి ఈడ్చుకుపోయింది.

* * *

పెళ్ళికూతురు పిన్నీ వాళ్ళింటికొచ్చేశాం. అందర్నీ కుర్చీల్లో కూర్చోపెట్టారు. నేనూ, అమ్మా, నాన్నా, బాబాయ్యా,తాతగారూ అందరం కుర్చీలో కూర్చొన్నాం.

ఈ కుర్చీలు మా ఇంట్లో సోఫాల్లాగా మెత్తగాలేవు... నేను కూర్చొన్న కుర్చీ అటూ ఇటూ ఊగుతోందికూడానూ.

అమ్మ చెప్పినట్లు వాళ్ళు అందరికీ ప్లేట్లలో బిస్కట్లుపెట్టి మధ్య టేబిల్ మీద పెట్టేశారు.

అమ్మ ముందే చెప్పేసిందిగా... బుద్ధిగా ఉండాలని ! అందుకే బోల్డన్ని తీసుకోవాలనిపించినా ఒక్కటే బిస్కట్టు తీసుకొన్నాను. కూర్చున్న కుర్చీ బాగాలేదు... బిస్కట్టుకూడా ఒక్కటే తీసుకొన్నాను. అయినాసరే ఇంట్లో లాగ నాకు కోపం రానేలేదు ! ఎందుకో తెలుసా !

మా అందరికి ఎదురుగా కుర్చీలో కూర్చొని ఉందిగా... పెళ్ళికూతురు పిన్ని... ఎంత బాగుందో !

అందుకే బిస్కట్టు తినడం మర్చిపోయి కూడా ఆ ఆంటీనే చూస్తూ కూర్చొన్నాను.

నా బర్త్‌డేకి అమ్మ కొందిగా పసుప్పచ్చటి గౌను ? సరిగ్గా ఆ రంగులోనే ఉంది ఆంటీ.

మరేమో కళ్ళెంత బాగున్నాయో ! పుస్తకాల్లో బొమ్మలకి వేస్తుంటారే కళ్ళు ? అంత బాగున్నాయి ! ఆంటీ బోల్డు బోల్డు బాగుంది ! మరేమో అంత బాగుందా... అయినా సరే ఎందుకో ఎవరివైపూ చూడకుండా మధ్యనున్న టేబిల్‌వైపే చూస్తూ కూర్చొంది. అప్పుడప్పుడు కొంచం కొంచం బాబాయివైపు చూస్తోంది. అంతే. కాని బాబాయి మాత్రం నాలాగే అలా ఆ ఆంటీవైపే చూస్తూ కూర్చొన్నాడు.

నాన్నగారూ, అమ్మా, నాయనమ్మ, తాతయ్యా అందరూ ఏంటేంటో అడిగేస్తున్నారు ఆ ఆంటిని.

ఆ ఆంటీయేమో మెల్లగా జవాబులు చెప్తోంది.

"ఒకపాట పాడుతల్లీ" అంది నాయనమ్మ.

నేను రోజూ రేడియోలో పాటలు వింటూ ఉంటానుగా ! అంత బాగా పాడింది. ఊహూ ఇంకా బోల్డుబాగా పాడింది.

కొంచెంసేపయ్యాక ఆ ఆంటీ లోపలికెళ్ళిపోయింది.

"నువ్వూ లోపలికెళ్ళి ఆ ఆంటీతో మాట్లాడు" అన్నాడు నా పక్కనే కూర్చున్న బాబాయి నా చెవిలో గుసగుసగా.

నాకు భలే సరదా వేసింది.

అసలు నా అంతట నేనే ఆంటీ వెనకే లోపలికెళ్దామనుకొన్నాను. కాని అమ్మ కోప్పడుతుందేమోనని భయమేసింది. మరి బాబాయి వెళ్ళమన్నాడుగా. అందుకే ఎంచక్కా లోపలి కెళ్ళాను.

అక్కడ మంచంమీద తన పక్కనే కూర్చోపెట్టుకొంది ఆ ఆంటీ.

"నీ పేరేంటి పాపా ?"

నన్ను బోల్డుమంది పెద్దవాళ్ళు ఈ ప్రశ్న అడిగారా ? ఈ ఆంటీ అడిగినంత ముద్దుగా ఎవళ్ళూ అడగలేదు.

"సుధ ... మరేమో ... ఇంట్లోఅందరూ చిట్టీ అని పిలుస్తారు."

"స్వీట్ గర్ల్ ! ఏ క్లాసు చదువుతున్నావ్ ?"

"ఒకటో క్లాసు ఆంటీ...మొన్న క్లాసులో సెకండ్ రాంకు వచ్చాను తెలుసా ! మరేమో ఈసారి ఫస్టొస్తే నాన్న మంచి గౌను కొంటానన్నారు తెలుసా ?"

"మరి బాగా చదువుతున్నావా ?"

"ఓ ..."

ఆ ఆంటీ నన్ను ఒళ్ళో కూర్చోపెట్టేసుకొని గట్టిగా ముద్దు పెట్టేసుకొంది. ఎంత బాగుందో ఆ ముద్దు !

మా ఊళ్ళోకూడా ఇలాంటి ఆంటీలు చాలా మంది ఉన్నారు. ఎవ్వరూ నన్నిలా ముద్దు చెయ్యలేదు.

ఓసారి బాబాయి నడిగాను. "బాబాయ్... మరీ పక్కింటి రాధ ఆంటీ... ఎదురింటి సుందరి ఆంటీ... వీళ్ళంతా ఎప్పుడూ నాతో సరిగ్గా మాట్లాడరేం ? నన్ను ముద్దు చెయ్యరేం ?"

"అందంగా ఉన్నామని వాళ్ళకి గర్వంలే !" అన్నాడు బాబాయి. ఏమిటో... నాకేం అర్థం కాలేదు.

మరి ఈ ఆంటీకూడా అందంగా ఉందిగా?

"పాపా మరి ఇందాక ఒక్కటే బిస్కట్టు తిన్నావుగా ఇంకా ఇవ్వనా ?"

ఒక్కొక్కసారి అమ్మ ఎంతో ప్రేమగా దుగుతూ ఉంటుందే! అలాగే అడిగింది. మ్మా నాన్నా అక్కడ లేరుగా! అందుకే యంలేకుండా కావాలనేశాను.

ఆ ఆంటీ బోల్డు బిస్కెట్లు తెచ్చి చ్చింది. అవి తింటూ కూర్చొన్నాను.

అంతవరకూ ముందుగదిలో పెద్దవాళ్ళం రూ ఏమిటేమిటో మెల్లిగా మాట్లాడేసు ంటున్నారు కదా! ఎందుకో ఒక్కసారి గట్టిగా ాట్లాడుకోడం మొదలెట్టారు.

ఏమయింది చెప్మా అనుకొని నేనూ ఆ దిలోకెళ్ళాను.

"ఇరవై వేలకి తూగలేమండీ..అమ్మాయిని ూశారుగా?... పని పాటలు చక్కగా చేస్తుంది. ంగీతం మీరే విన్నారు... దయచేసి సరిపెట్టు ోండి నా జీతంలో పైసా పైసా కూడబెట్టి ంత చెయ్యగలిగాను... పెద్దవాళ్ళు మీరే అలా నేస్తే ఎలా చెప్పండి?"

కళ్ళజోడు పెట్టుకొన్న తాతగారు తాతయ్య వైపు తిరిగి జాలిగా అడుగుతున్నారు.

"ఏమిటో ఈ పెద్దవాళ్లు! వీళ్ళ మాటలు ఒక్కటీ అర్థంకావు కదా!"

"అలా అనేస్తే ఎలా చెప్పండి... వ్యహారాల దగ్గర నాకసలే మొహమాటం జాస్తి... అయినా సరే మిమ్మల్ని చూడగానే ఏదో చనువు పుట్టి... మీ మంచితనం చూసి అడగడానికి ధైర్యం చేసేశాను... కాదన్న నమ్మకమూ నాకుంది" తాతయ్య ఆ కళ్లజోడు తాతగారి వైపు తిరిగి అన్నాడు.

"రాజమండ్రి వాళ్లు ముప్పైవేలన్నారు... అనకాపల్లి వాళ్లు పాతిక వేలన్నారు. అమ్మాయి బాగుంటుంది ... సాంప్రదాయం మంచిదని వచ్చాం..." నాయినమ్మ అంది.

"కాదనకండి మరి. మీరు పదివేలన్నారు ...పోనీ మరో ఐదువేలు ... అబ్బాయి చదువుకి చేసిన అప్పుకి వడ్డీ ఇంకా కడుతూనే ఉన్నాం" అన్నాడు తాతయ్య.

ఏమిటోగోల! ఒక్కముక్క అర్థంకాలేదు. ఎంచక్కా ఆంటీ దగ్గరకే వెళ్లి కూర్చొంటాను. చక్కా కబుర్లు చెపుతోంది. కాని ఎందుకో మరి ఆ ఆంటీ ఇందాకట్లా సరదాగా మాట్లాడలేదు. ఎటో చూస్తూ కూర్చొంది.

"చిట్టీ దామ్మా వెళ్దాం" ఆంటీకి టాటా చెప్పేసి అమ్మావాళ్ల దగ్గర కొచ్చేశాను.

మళ్లా రైలెక్కేశాం.

వస్తున్నప్పుడు కిటికీపక్కనే నన్ను కూర్చో పెట్టుకొని బోల్డుకబుర్లు చెప్పాడా...ఇప్పుడేమో అస్సలు మాట్లాడకుండా కిటికీలోంచి బయటకు చూస్తూ కూర్చొన్నాడు బాబాయి.

మరి నేను వచ్చేసేప్పుడు పెళ్ళికూతు రాంటీ కూడా ఇలాగే కూర్చొని ఉందే?

ఎందుకు చెప్మా?

ఆ తెలిసింది... మా తతయ్యా... ఆ కళ్ళజోడు తాతగారూ, నాయినమ్మా అందరూ కలిసి పదివేలు... ఇరవైవేలు అంటూ ఏంటేటో మాట్లాడేసుకొన్నారుగా? అప్పట్నించే వీళ్ళిద్దరూ ఇలా ఉన్నారు. మెల్లిగా వెళ్ళి బాబాయి ఒళ్ళో కూర్చొన్నాను.

"బాబాయ్... బాబాయ్ ఇందాకా వాళ్ళింట్లో మన తాతగారూ, వాళ్ళ తాతగారూ, నాయినమ్మా... అందరూ కలిసి పదివేలు, ఇరవైవేలు అని మాట్లాడేసుకొన్నారు కదా? ఏమిటి బాబాయ్ అవి?"

"అవా? అవి రూపాయలు!" అన్నాడు బాబాయి కిటికీలోంచి బయటకు చూస్తూనే.

"అయ్యబాబోయ్! పదివేల రూపాయలే? దేనికి బాబాయ్ అన్ని రూపాయలు?"

"దాన్ని కట్నం అంటారమ్మా."

"అంటే ఏమిటి బాబాయ్?"

"నువ్వెప్పుడూ అమ్మతో కలిసి కూరల దుకాణానికి వెళ్ళలేదూ?"

"బోల్డుసార్లు వెళ్ళానుగా!"

"మరేమో అప్పుడు కూరలవాడు రెండు రూపాయలు కిలో అంటాడు. అమ్మేమో రూపాయికిస్తావా? అంటుంది."

"అవునవును."

"అటువంటిదే కట్నం కూడానూ" బాబాయి కోపంగా అన్నాడు.

మొదట నాకేం అర్థం కాలేదు. తర్వాత కిటికీ పక్కన కూర్చొని చాలాసేపు ఆలోచించేశాను.

ఇంటికి కూరలు తెచ్చుకొంటే అమ్మ కూరలవాడికి పది రూపాయలిస్తుంది... నాకోసం బొమ్మని కొని తెచ్చినప్పుడు షాపువాడికి ఇరవై రూపాయలిచ్చింది. బర్త్‌డేకి నాకు గౌను కొని ఇంటికి తెచ్చినప్పుడు యాభైయ్యో, వందో, మూడువందలో ఇచ్చింది. మరిప్పుడు ఆ ఆంటీని వాళ్ళింటినుండి మా ఇంటికి తెచ్చేసుకొంటున్నాం కదా! మరి ఆ ఆంటీవాళ్ళ అమ్మకీ నాన్నకీ డబ్బులివ్వొద్దా? ఎంతో...ఎంతో...అందంగా ఉంది. బోల్డుబాగా పాడింది. ఎంతో చక్కా కబుర్లు చెప్పింది. అమ్మలాగే బోల్డు ముద్దు చేసింది. మరి అంత మంచి ఆంటీని తెచ్చేసు కొంటుంటే వాళ్ళకి బోల్డు ... బోల్డు ... డబ్బు లియ్యొద్దా?

ఇరవైవేల రూపాయలంటే బోల్డు డబ్బు అనుకో ... రెండు బస్తాల బిస్కెట్లు వస్తాయి. నాలుగు డ్రమ్ముల చాక్లెట్లు వస్తాయి ... పదిహేనో నలభైయ్యో మంచి గౌన్లొస్తాయి.

అయినా అంతమంచి ఆంటీ వస్తున్నప్పుడు ఇవన్నీ ఎందుకూ? ఇరవై వేలేంటి ... ఆ ఆంటీ గురించి లక్షరూపాయలిచ్చేయొచ్చు కోటి రూపాయలిచ్చేయొచ్చు ...

ఆంటీని తెచ్చుకోడానికి పాపం తాతయ్య దగ్గిరా, నాయనమ్మ దగ్గరా అన్ని డబ్బులు లేవేమో!

కూరలకి డబ్బులు సరిపోనప్పుడు అమ్మ బేరం చేస్తుందే ... అందుకే ఆలా బేరం చేశారేమో!

మరి ఆ ఆంటీని మా ఇంటికి తెచ్చుకోకపోతే ఎలా?

నాకూ, బాబాయికీ బోల్డు ఏడుపొస్తుంది కదా!

మళ్ళా చాలాసేపు ఆలోచించేశాను.

ఆ ... అయిడియా వచ్చింది.

గబగబా నాయినమ్మా, తాతగారూ కూర్చొన్న సీటు దగ్గరకెళ్ళాను.

"నాన్నమ్మా ... ఇందాక నిన్నూ, తాతయ్యనూ చూస్తుంటే నాకెంత జాలేసిందో తెలుసా! పాపం ఆ పెళ్ళికూతురు ఆంటీని మనింటికి తెచ్చేసుకోవాలనీ మీకుందికదా. కాని మీ దగ్గర డబ్బు సరిపోలేదు కదా! అందుకే అంతసేపు బేరం చేశారు కదా?"

ఏమిటో ఈ పెద్దవాళ్ళు! నేను అంటున్న దేమిటో అర్థం కానట్లు అలా నా వైపు చూస్తూ ఉండిపోయారు. వీళ్ళు మాత్రం మళ్ళీ అన్ని మాటలూ అర్థం కాకుండానే మాట్లాడతారు!

అందుకే మళ్ళా బాగా అర్థమయ్యేటట్లు చెప్పాను.

"అదికాదు తాతయ్యా... ఆ ఆంటీని తెచ్చుకోవాలంటే మనం బోల్డు డబ్బు ఇయ్యాలి కదా! మరంత మంచి ఆంటీని తెచ్చుకొంటు న్నప్పుడు ఇయ్యొద్దూ? మరి మీకు డబ్బు చాల్లేదు కదా? అందుకే నా కిడ్డీ బాంకులో దాచుకొన్న ఇరవై రూపాయలూ తీసేస్కోండి... ఇంకా డబ్బులు తక్కువైతే మళ్ళా ఇస్తాన్లే... మరే... ఆ డబ్బుతో... బోల్డన్ని బొమ్మలూ, గౌన్లూ వస్తాయనుకో... అయినా అంత మంచి ఆంటీ వస్తున్నప్పుడు ఆ వెధవ గౌన్లూ, బొమ్మలూ అక్కర్లేదు లెద్దూ... మరి ఆ డబ్బు తీసుకొంటారా?"

అంతే! నాయనమ్మా, తాతగారూ ఒకరి మొహం ఒకరు చూసుకొంటూ ఉండిపోయారు. అమ్మేమో నాన్నవైపు చూసి నవ్వింది... నాన్న ఎందుకోమరి గబుక్కున ఇంకోవైపుకి మొహం తిప్పేసుకొన్నాడు. బాబాయేమో గబుక్కున నన్ను ఒళ్ళో కూర్చోపెట్టేసుకొన్నాడు... గబుక్కున నా బుగ్గమీద ముద్దు పెట్టేసుకొన్నాడు. మళ్ళా అమ్మవైపు చూసేసరికి ఎందుకో అమ్మ కళ్ళలో నీళ్ళున్నాయి.

నేనడిగిన దానికి మాత్రం ఒక్కరూ జవాబు చెప్పలేదు.

"ఏమిటో ఈ పెద్దవాళ్ళు!?" ★